సమస్యల పరిష్కారానికే భూ భారతి

కేశవరం అవగాహన సదస్సులో కలెక్టర్ గౌతమ్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

శామీర్‌పేట్: భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, ఈ చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. శనివారం మూడుచింతలపల్లి మండలం, కేశవరం గ్రామ పరిధిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ... ప్రభుత్వం ఎన్నో విధాలుగా ఆలోచించి ధరణిలోని సమస్యలను తొలగించి భూ భారతి చట్టాన్ని ప్రవేశపెట్టిందని, అనుభవజ్ఞులైన రిటైర్డ్ ఉద్యోగులు, నిపుణులు ఎంతో మందితో చర్చించి ప్రభుత్వం ఈ చట్టాన్ని రూపొందించిందన్నారు. ధరణిలో రెవెన్యూ అధికారులకు ఎలాంటి అధికారాలు, హక్కులు లేకుండా ప్రతీ సమస్యకు కోర్టుకు వెళ్లాల్సి ఉండేదని కలెక్టర్ పేర్కొన్నారు. ఇప్పుడు కోర్టులకు వెళ్లకుండా రెవెన్యూ అధికారులు సమస్యలను పరిష్కరించేలా భూ భారతి చట్టంలో తహసీల్దార్ స్థాయి నుంచి సీసీఎల్ఏ స్థాయి వరకు పరిష్కరించే వెసులుబాటు కల్పించామన్నారు. ధరణిలో నష్టపోయిన వారు ఇప్పటికీ కొంత మందికి న్యాయం జరగలేదని, భూ భారతి చట్టం ద్వారా భవిష్యత్తులో కూడా ఎలాంటి సమస్యలు రాకుండా పకడ్బందీగా ఈ చట్టం ఉపయోగపడుతుందన్నారు.

ఆధార్ తరహాలో 'భూధార్'..

భూ భారతిలో ప్రభుత్వం ఆధార్ తరహాలో భవిష్యత్తులో శాటిలైట్ ఆధారంగా భూమికి సంబంధించి సర్వే చేసిన కొలతలు, హద్దుల వంటి సమగ్రమైన వివరాలతో 'భూధార్' తీసుకురాబోతుందని, తద్వారా చాలా పకడ్బందీగా మ్యాపింగ్ ఉంటుందని తెలిపారు. ఈ భూధార్ విజయవంతమైతే భవిష్యత్ తరాలకు ఎలాంటి భూ ఆక్రమణ సమస్యలు ఉండబోవన్నారు. కీసర ఆర్డీఓ ఉపేందర్‌రెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలుయాదవ్, మూడుచింతలపల్లి తహసీల్దార్ వెంకటనర్సింహారెడ్డి, శామీర్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, రైతులు ప్రజలు తదితరులున్నారు.

రేపు భూ భారతిపై అవగాహన

మేడ్చల్: ప్రభుత్వం ధరణి స్థానంలో నూతనంగా ప్రవేశపెట్టిన భూ భారతిపై మండల ప్రజలకు రేపు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు మేడ్చల్ ఇన్‌చార్జ్ తహసీల్దార్ తెలిపారు. పట్టణంలోని ఓం శివసాయి ఫంక్షన్‌హాల్‌లో సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. మండల రైతులు, ప్రజలు అవగాహన సదస్సుకు హాజరుకావాలని కోరారు.

సామాజిక నిధి సేకరణ

మేడ్చల్ : సామాజిక పోరాటాలను ముందుకు తీసుకెళ్లడానికి సామాజిక నిధి వసూలు కార్యక్రమాన్ని ఏప్రిల్‌లో చేపట్టిందని, మండల సీఐటీయూ కార్యదర్శి నర్సింగ్‌రావు అన్నారు. మండలంలోని వివిధ కంపెనీల్లో సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం సామాజిక నిధి సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఏప్రిల్‌లో మహనీయులు అంబేడ్కర్, పూలే, రణదీవె వంటి వారు జన్మించారని వారి సామాజిక పోరాటలను ముందుకు తీసుకెళ్లడానికళ్లీ నెలలోనే నిధి సేకరణను చేపట్టామన్నారు. తమ ఉద్యమాలకు అందరూ సహకరించాలని కోరారు. సీఐటీయూ నాయకులు యాదగిరి, కావేరి, నాగరాణి, తదితరులున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ..

- మందుల కోసం కేరళకు వెళ్లిన కుటుంబం
- తాళాలు పగులగొట్టి నగదు, వెండి వస్తువుల అపహరణ



కీసర: ఇంటి తాళాలు పగులగొట్టి నగదు, వెండి వస్తువులు చోరీ చేసిన ఘటన కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగారం శిల్పానగర్‌లోని ప్యారామౌంట్ అపార్ట్‌మెంట్‌లో నివసించే శశిధర్, కుటుంబసభ్యులతో కలిసి ఉంటున్నారు. శశిధర్ గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో ఆయుర్వేద మందులు తెచ్చుకునేందుకు ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి కేరళకి వెళ్లాడు. శుక్రవారం రాత్రి దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి కిటికీల గ్రిల్స్ తొలగించి బీరువాలో ఉన్న రూ.15 వేల నగదు, రాగి వస్తువులు దొంగిలించారు. అపార్టుమెంట్‌లో ఉండే వ్యక్తి గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో వారు సీసీ కెమెరాలను పరిశీలించారు. ముగ్గురు దుండగులు చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. బాధిత కుటుంబసభ్యులు వస్తే ఎంతమేర చోరీ జరిగిందనే విషయాలు తెలుస్తాయని పోలీసులు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెల్లువలా దరఖాస్తులు !

రాజీవ్ యువ వికాసం పథకానికి 66,648 దరఖాస్తులు

- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 24,610 యూనిట్ల మంజూరు
- రెండు దశల్లో దరఖాస్తుల పరిశీలనకు యంత్రాంగం కసరత్తు
- జూన్ 2న లబ్ధిదారులకు అర్హత పత్రాలు అందజేసేందుకు చర్యలు

సాక్షి, సిటీబ్యూరో: రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తులు వెల్లువెత్తాయి. రాయితీ రుణాల కోసం మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా 66,648 దరఖాస్తులు వచ్చాయి. గడువు పొడిగించాలని పలు విజ్ఞప్తులు వచ్చినా గతంలో ఒకసారి పొడిగించినందున ప్రభుత్వం మరో అవకాశం ఇవ్వలేదు. ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లోనూ అవకాశం కల్పించడంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ, క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ల వారీగా భారీగా దరఖాస్తులు నమోదయ్యాయి. రూ.50 వేల వరకు 100 శాతం రాయితీ ఉండగా.. రూ.50,001 నుంచి రూ.లక్ష వరకు 90 శాతం రాయితీ, 10 శాతం బ్యాంకు రుణం, రూ.1,00,001 నుంచి రూ.2 లక్షల వరకు 80 శాతం రాయితీ, 20 శాతం బ్యాంకు రుణం. రూ.2,00,001 నుంచి రూ.4 లక్షల వరకు 70 శాతం రాయితీ, 30 శాతం బ్యాంకు రుణం అందజేస్తోంది.



రెండు దశల్లో దరఖాస్తుల పరిశీలన..

రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల్లో అర్హులు, అనర్హులు ఎవరనేది నలుగురు సభ్యులతో కూడిన ప్రత్యేక కమిటీతో విచారణ చేయనున్నారు. గ్రామీణ ప్రాంతంలో ఎంపీడీఓ ఆధ్వర్యంలో పురపాలికల్లో కమిషనర్ ఆధ్వర్యంలో కమిటీ పరిశీలన చేయనుంది. సభ్యులుగా బ్యాంక్ మేనేజర్, ఐకేపీ ఏపీఎం, సంబంధిత కార్పొరేషన్ ఉద్యోగి కమిటీలో ఉంటారు.

◆ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల జనాభా ఆధారంగా యూనిట్లను ఖరారు చేయనున్నారు. మొత్తం యూనిట్లలో 25 శాతం మహిళలకు కేటాయిస్తారు. అందులో ఒంటరి, వితంతు మహిళలకు ప్రాధాన్యం ఉంటుంది. దివ్యాంగులకు మరో 5 శాతం కేటాయిస్తారు.

◆ క్షేత్ర స్థాయిలో విచారణ అనంతరం అర్హులను తేలుస్తారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఆమోదంతో కలెక్టర్ లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం (జూన్ 2న) రుణం మంజూరు పత్రాలను అర్హత పొందిన లబ్ధిదారులకు అందజేయనున్నారు.

ప్రతులు తప్పనిసరిగా..

ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్న వారు ఒక ప్రతిని డౌన్‌లోడ్ చేసుకుని సంబంధిత పత్రాలను జతచేసి ఎంపీడీఓ, పురపాలక సంఘాల కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుంది. చాలామంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని వదిలేశారు.

◆ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా దరఖాస్తు చేసుకున్న వారిలో 25 శాతం మంది సంబంధిత కార్యాలయాల్లో దరఖాస్తు ప్రతులను అందజేయలేదు. ఆన్‌లైన్ దరఖాస్తు పత్రాలను తప్పనిసరిగా సంబంధిత కార్యాలయాల్లో అందజేయాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ శాఖల జిల్లా అధికారులు కోరుతున్నారు.

శాఖల వారీగా వచ్చిన దరఖాస్తులు ఇలా..

1) బీసీ, ఈబీసీల నుంచి అందిన దరఖాస్తుల సంఖ్య 37,935 , మంజూరైన యూనిట్లు 13,400
2) ఎస్సీల నుంచి అందిన దరఖాస్తుల సంఖ్య 16,300, మంజూరైన యూనిట్లు 6,201
3) ఎస్టీల నుంచి వచ్చిన దరఖాస్తుల సంఖ్య 2,196, మంజూరైన యూనిట్లు 1,594
4) క్రిస్టియన్ మైనార్టీల నుంచి వచ్చిన దరఖాస్తులు 10,217, మంజూరైన యూనిట్లు 3,415

కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, మున్సిపల్ సిబ్బంది వేతనాలను చెల్లించాలని శనివారం బీజేపీ నేతలు మున్సిపల్ కమిషనర్ నాగమణికి వినతిపత్రం అందజేసారు. ఈ సందర్భంగా నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, బీజేపీ నేతలు మోర నాగమల్లారెడ్డి, సామల భరత్‌రెడ్డి మాట్లాడుతూ.. గత రెండు నెలలుగా కార్మికులకు వేతనాలు చెల్లించని కారణంగా వారు ఇబ్బందులు పడాల్సి వస్తుందని, నెలజీతం పైనే కార్మికుల జీవితాలు ఆధారపడి ఉంటాయని, సకాలంలో జీతాలు చెల్లించకపోవడంపై ఆయన మండిపడ్డారు. పక్కనే ఉన్న నాగారం మున్సిపల్ కార్యాలయంలో ప్రతినెల మున్సిపల్ కార్మికులు, సిబ్బందికి వేతనాలు చెల్లిస్తున్నారని, ఇక్కడ ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు సకాలంలో స్పందించి కార్మికులకు వేతనాలు చెల్లించాలని కోరారు. లేదంటే కార్మికులతో కలిసి మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడతామని హెచ్చరించారు. బీజేపీ నేతలు రాము, రవీందర్‌గౌడ్, బాపిరెడ్డి, దాసరి సురేందర్‌రెడ్డి, సతీష్‌కుమార్, ఆంజనేయులు, కృష్ణ, సాయికృష్ణ, చారి, చక్రపాణి, సురేష్, బీజేపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్ నాగమణికి వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నేతలు

భూ భారతిపై ఎన్నో ఆశలు !

- ఈనెల 26 వరకు మండలాల వారీగా అవగాహన సదస్సులు
- ధరణి స్థానంలో 'భూ భారతి' రెవెన్యూ చట్టాన్ని తెచ్చిన ప్రభుత్వం
- భూ సమస్యలు గట్టెక్కగలవని ఎదురుచూస్తున్న రైతులు

సాక్షి, సిటీబ్యూరో: భూ రికార్డుల నిర్వహణలో పారదర్శకత, భూ సమస్యల పరిష్కారానికి ఆర్వోఆర్ చట్టం–2020 ధరణి స్థానంలో నూతన రెవెన్యూ చట్టం 'భూ భారతి–2025'ని రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చింది. దీంతో గత 5–6 ఏళ్లుగా నిషేధిత భూముల జాబితా, పార్టు–బి భూములు, మిస్సింగ్ సర్వే నెంబర్లు, పేర్ల మార్పు, భూ హక్కులు, సాదాబైనామాల క్రమబద్ధీకరణ లాంటి అపరిష్కృత సమస్యలు పరిష్కారం అవుతాయన్న ఆశాభావం రైతుల్లో వ్యక్తమవుతోంది. భూ సమస్యల పరిష్కారం తహసీల్దార్ స్థాయిలో కాకపోతే.. ఆర్డీవో.. అక్కడి నుంచి కలెక్టర్‌కు అప్పీలు చేసుకునే అవకాశాన్ని నూతన చట్టంలో కల్పించడం.. అందుకు ట్రిబ్యునళ్ల ఏర్పాటు చేయడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

◆ మ్యుటేషన్లు, వారసత్వ బదిలీ, నాలా కన్వర్షన్స్, సక్సెషన్, పీవోబీ, పాస్ పుస్తకాల్లో తప్పుల సవరణలు, కొత్త పాసుపుస్తకాల జారీ తదితరాలకు సంబంధించి జిల్లాలో సుమారు 4 వేల దరఖాస్తులు పెండింగ్ ఉన్నాయి. వీటిని జూన్ 2 వరకు పరిష్కరించవచ్చని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది.

◆ కొత్త చట్టంలోనే సాదాబైనామాలతో పాటు పార్టు–బీలను కూడా పరిష్కరిస్తామని ప్రభుత్వం పేర్కొంటోంది.

◆ మేడ్చల్ జిల్లాలో సరైన రికార్డులు లేని వందల ఎకరాలను గత ప్రభుత్వం పార్టు–బీలో చేర్చడంతో కొంతమంది రైతులు వారి అవసరాలకు అమ్ముకోలేని పరిస్థితి నెలకొంది.

◆ 2014 జూన్‌లోగా సాదాబైనామాల ద్వారా భూక్రయవిక్రయాలు జరిపిన రైతులకు భూ భారతితో చట్టబద్ధత రానుంది. గతంలో తహసీల్దార్ ఆర్డీఓలకు ఉన్న అధికారాలను ధరణి పోర్టల్ ద్వారా కలెక్టర్లకు అప్పగించడంతో భూసమస్య పరిష్కారంలో తీవ్ర జాప్యం నెలకొంది. దీంతో కొంతమంది బాధితులు సీసీఎల్ఏకు వెళ్లి దరఖాస్తులు పెట్టుకున్న దాఖలాలు ఉన్నాయి. ధరణి పోర్టల్‌లో 35 రకాల ఆప్షన్స్(ఐచ్ఛికా)లను పొందుపరిచినా.. సమస్యలు పరిష్కారం కాలేదు. వీటన్నింటికి భూభారతి కొత్త చట్టంలో పరిష్కారం లభిస్తుందని రెవెన్యూ వర్గాలు పేర్కొంటున్నాయి.

కలెక్టర్ హాజరై..

భూ భారతిపై నిర్వహించ తలపెట్టిన అవగాహన సదస్సుల్లో జిల్లా కలెక్టర్‌తో సహా ఉన్నతాధికారులు హాజరుకానున్నారు.

◆ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఈనెల 21న మేడ్చల్, 22న శామీర్‌పేట, 23న మేడిపల్లి, 24న కీసర, 25న ఘట్‌కేసర్, 26న దుండిగల్ గండి మైసమ్మ మండలాల్లో భూభారతిపై అవగాహన సదస్సులు జరుగనున్నాయి. ఈ సదస్సుల్లో రైతులు, క్షేత్రస్థాయి సిబ్బందికి పోర్టల్‌పై అవగాహన కల్పిస్తారు.

మేడ్చల్‌పై ప్రత్యేక దృష్టి..

సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ఎంపీగా ప్రాతినిధ్యం వహించిన మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా ఉండటంతో భూభారతి అమలుపై రెవెన్యూ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. జిల్లాలో ప్రభుత్వ భూములను చాలామంది నకిలీ పత్రాలతో పట్టాలు చేసుకోవడం, పార్టు–బీ భూములు సైతం ఎక్కువగా ఉండటం తదితర కారణాల నేపథ్యంలో మేడ్చల్ జిల్లాపై స్పెషల్ నజర్ పెడుతున్నట్లు తెలుస్తోంది.

ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతులు..

ఈ ప్రాంత భూ సమస్యలపై ఎంపీగా ఉన్న సమయంలో సీఎం రేవంత్‌రెడ్డికి అనేక ఫిర్యాదులు వచ్చాయి. మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో భూ సమస్యలు కూడా అధికంగానే ఉన్నాయి. పట్టాదారు పాసుపుస్తకాలు లేక కొందరు, రికార్డుల్లో తారుమారు కావడంతో మరికొందరు ఇబ్బందులు పడుతున్నారు. భూభారతితో ఇలాంటి సమస్యలు తొలగిపోతాయని రైతులు భావిస్తున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ గౌతమ్

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పౌరసరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్‌తో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ.. యాసంగి వడ్ల కొనుగోళ్లు, సన్నబియ్యం పంపిణీ, తాగునీటి సరఫరా తదితర విషయాల్లో ప్రభుత్వం ఆదేశాలకు అనుగుణంగా అన్నీ రకాల చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. రైతు సంక్షేమంలో భాగంగా జిల్లాలో 12 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి యాసంగి 2024–25 సీజన్ ధాన్యం కొనుగోలు చేస్తుందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందన్నారు. తాగునీరు, నీడ ఏర్పాట్లు చేయాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. అర్హులైన రేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ చేయాలన్నారు. మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, సివిల్ సప్లై జనరల్ మేనేజర్ సుగుణబాయి పాల్గొన్నారు.



ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

శామీర్‌పేట్: వాహనదారులు ట్రాఫిక్ నియమాలను పాటించి వాహనాలు నడపాలని మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి అన్నారు. మేడ్చల్ జిల్లా, తూంకుంట మున్సిపాలిటీ పరిధిలో శనివారం ఆయన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వాహనదారులు, ఆటోడ్రైవర్లు, ట్రాఫిక్‌రూల్స్ పాటించాలని ప్రతిజ్ఞ చేయించారు. విశ్వవిశ్వాని కళాశాల విద్యార్థులు నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శామీర్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్, ఎస్సైలు దశరథ, వాహనదారులు తదితరులున్నారు.

చైన్‌స్నాచర్ అరెస్ట్



నిందితుడు వెంకటస్వామి

పోచారం: మహిళ మెడలో బంగారు గొలుసు లాక్కెళ్లిన వ్యక్తిని పోచారం పోలీసులు 24 గంటల్లోనే అరెస్ట్ చేశారు. శనివారం ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. అన్నోజిగూడలోని హనుమాన్‌నగర్‌లో ధర్న బోయిన పద్మ (59) నివాసం ఉంటోంది. ఆంధ్రప్రదేశ్ తూర్పు గోదావరి జిల్లాకు చెందిన నక్కా సూర్యవెంకటస్వామి (24) కర్మన్‌ఘాట్‌లోని గాయత్రీనగర్‌లో నివాసం ఉంటూ క్యాబ్‌డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కాగా శుక్రవారం పద్మ ఇంటి ముందు వెంకటస్వామి కారును పార్కుచేసి ఆమెను తాగేందుకు నీళ్లు అడిగాడు. నీరు తాగిన తర్వాత ఇంట్లోకి వెళ్తుండగా.. ఆమె మెడలోని 4.5 తులాల బంగారు మంగళసూత్రాన్ని బలవంతంగా లాక్కొని కారులో పారిపోయాడు. ఈ ఘటన జరిగిన 12 గంటల వ్యవధిలోనే నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి శనివారం కోర్టులో హాజరుపరిచారు. అతడి వద్ద లభించిన 4.5 తులాల మంగళసూత్రం, కారు, మొబైల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

నవజాత శిశువు మృతి

డాక్టర్ల నిర్లక్ష్యంతోనే మృతిచెందిందని బంధువుల ఆందోళన



మేడ్చల్: రాత్రి సమయాల్లో మేడ్చల్ సీహెచ్‌ఎన్‌సీలో వైద్యులు విధులకు రాకపోవడం, నర్సులు సకాలంలో స్పందించకపోవడంతో నవజాత శిశువు మృతి చెందింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం కుక్కునూరు గ్రామానికి చెందిన వంశీ నిండు గర్భిణీగా ఉన్న తన భార్య శిరీషను ఈనెల 15న పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో చేర్పించగా.. అదేరోజు ఆమె శిశువుకు జన్మనిచ్చింది. శుక్రవారం రాత్రి శిశువు ఏడుస్తుండటం, శరీరం బాగా వేడిగా ఉండటంతో రాత్రి శిరీష బంధువులు నర్సులకు తెలపగా.. చిన్న పిల్లల డాక్టర్లు వస్తారని, 3 గంటల పాటు వేచి ఉంచారు. సమయం దాటినా వైద్యులు రాకపోవడంతో నర్సు డాక్టర్‌కు ఫోన్‌చేసి శిశువు పరిస్థితి బాగా లేదని చెప్పడంతో వైద్యుడు తాను పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఉన్నానని, శిశువును అక్కడకు పంపాలని సూచించాడు. దీంతో శిశువు తండ్రి వంశీ చంటి పిల్లను తీసుకుని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ కొన్ని పరీక్షలు చేసి గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించడంతో తిరిగి గాంధీకి తరలిస్తుండగా మార్గ మధ్యలోనే శిశువు మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబసభ్యులు అర్ధరాత్రి మేడ్చల్ సీహెచ్‌ఎన్‌సీలో నిరసన చేపట్టారు. డాక్టర్ల నిర్లక్ష్యం కారణంగానే తమ తమ పసికందు మృతి చెందిందని దీనికి వైద్యులు భాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

వైద్యులపై చర్యలు తీసుకోవాలి..

డాక్టర్ల నిర్లక్ష్యం కారణంగానే తమ బిడ్డ మృతి చెందిందని వారిపై చర్యలు తీసుకోవాలని ఆసుపత్రిలో బైటాయించారు. వారి నుంచి సరైన సమాధానం రాకపోవడంతో మేడ్చల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి శిశువు మృతదేహన్ని గాంధీ మార్చురీకి తరలించారు. శనివారం మృతదేహన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం



మేడ్చల్ రూరల్: మేడ్చల్, కిష్టాపూర్ రోడ్డు పక్కన ఓ మహిళ మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 35 ఏళ్లున్న మహిళ మృతదేహం మేడ్చల్, కిష్టాపూర్ రోడ్డులోని కల్వర్టు కిందపడి ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతురాలి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. ఆమె ఒంటిపై పచ్చరంగు చీర జాకెట్ ఉన్నాయని, కిందపడి మరణించిందా.. లేదా ఇతర కారణాలేమైనా ఉన్నాయా.. తెలియాల్సి ఉందన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో 'రన్‌ఫర్ జీసస్'

పోచారం: ఘట్‌కేసర్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో 'రన్ ఫర్ జీసస్' కార్యక్రమం ఉల్లాసంగా నిర్వహించారు. శనివారం ఘట్‌కేసర్ గాస్పెల్ చర్చి వద్ద బిషప్ విల్సన్ సింగం ప్రారంభించిన ర్యాలీ రాజీవ్ గృహకల్ప, అన్నోజిగూడ, జోడిమెట్ల, చౌదరిగూడ, నారపల్లి, పోచారం, సింగపూర్ టౌన్‌షిప్ మీదుగా ఎమరాల్డ్ హైట్స్ క్రీస్తు జ్ఞాన మందిరం వద్ద ముగిసింది. క్రైస్తవ నాయకులు కృపానిధి, కాపు కుమార్, సురేందర్‌పాల్, ప్రభాకర్, డేవిడ్‌సన్, జాషువా, జీవన్, నక్షత్రమ్మ, విక్టర్ ఇమ్మాన్యుయేల్, యూత్ విభాగం నాయకులు డేవిడ్ లివింగ్‌స్టన్, అభిషేక్ తదితరులున్నారు.

వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో నిరసన

ఘట్‌కేసర్: పశ్చిమబెంగాల్‌లో హిందువులపై జరుగున్న దాడులు, మరణకాండను నిరసిస్తూ ఘట్‌కేసర్‌లో విశ్వహిందూపరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పశ్చిమబెంగాల్‌లో రాష్ట్రపతిపాలన విధించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌ముదిరాజ్, మహిపాల్‌రెడ్డి, అరవింద్‌ముదిరాజ్, గణేష్‌గౌడ్, శ్రీనివాసచారి, శ్రీనివాస్‌యాదవ్, రోహిత్‌గౌడ్, తిరుమలేష్, రాకేష్‌యాదవ్, వరుణ్‌ముదిరాజ్, శివచారి, కృష్ణమాచారి, వ్యాస్, హర్షముదిరాజ్, ప్రవీణ్‌కుమార్, బాలాజీ, వీరేశం, మోహన్‌నావు, బాలరాజ్‌ముదిరాజ్ పాల్గొన్నారు.



నిరసనలో వీహెచ్, బజరంగ్‌దళ్ కార్యకర్తలు



ఎంఈవో శశిధర్‌ను సత్కరిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి

ఆత్మీయ వీడ్కోలు

పదవీవిరమణ చేసిన ప్రభుత్వ ఉపాధ్యాయులు



ఘట్‌కేసర్: పట్టణంలోని జెడ్పీ బాలికల పాఠశాలలో ఉపాధ్యాయురాలు విజేతకేతిరెడ్డి పదవీవిరమణ సభను శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పావనీజంగయ్య హాజరై ఆమెను పూలమాల శాలువాతో సత్కరించారు. జంగయ్యయాదవ్, మల్లేష్, వెంకటరమణ, ఆంజనేయులు, ఫరూక్, సిరాజ్, నర్సింగ్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కీసర: కీసర మండల విద్యాధికారి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శశిధర్ పదవీవిరమణ పొందారు. శనివారం చీర్యాలలోని జయమోహన్ గార్డెన్‌లో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు రవిచంద్రశేఖర్ ఆధ్వర్యంలో శశిధర్ పదవీ విరమణ అభినందనసభ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి, మాజీ ఎమ్మెల్సీ కాటిపల్లి జనార్దన్‌రెడ్డి ఆయనను ఘనంగా సత్కరించారు. అనంతరం గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా కీసరలోని ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటారు. హరిత సేన మహిళా విభాగం అధ్యక్షురాలు మాధురివెంకటేష్, ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానంద్‌గౌడ్, టీయూటీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు, వివిధ మండలాల విద్యాధికారులు, పలు సంఘాల నాయకులు వెంకటేశ్వర్లు, సుధాకర్‌రెడ్డి, రాంరెడ్డి, మురళీకృష్ణ, రమేష్‌రెడ్డి, శ్రీధర్, వెంకటరామిరెడ్డి, రాజు, నవీన్, శ్రీధర్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

అవగాహనతోనే ప్రమాదాలు దూరం

- ఏటా పెరుగుతున్న అగ్నిప్రమాదాలు
- జాగ్రత్తలు పాటించాలంటున్న అధికారులు
- నేటితో ముగియనున్న అగ్నిమాపక వారోత్సవాలు

ఘట్‌కేసర్: ప్రతి వేసవికాలంలో జరిగే అగ్నిప్రమాదాల కారణంగా పెద్దఎత్తున ఆస్తినష్టంతో పాట లక్షలాది రూపాయల ఆస్తులు బుగ్గిపాలవుతున్నాయి. ప్రమాద సమయంలో అప్రమత్తంగా ఉంటే నష్టాన్ని తగ్గించుకోగలుగుతామని నిపుణులు సూచిస్తున్నారు. అగ్నిప్రమాదాలు నివారించడానికి అవసరమైన కేంద్రాలు, సిబ్బంది ఏర్పాటుతో పాటు ఆయా శాఖను బలోపేతం చేయడానికి ప్రభుత్వం చేస్తున్న చర్యలు సరిపోవడం లేదు. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 20 వరకు అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా వేసవిలో అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక కథనం.

ముందస్తు జాగ్రత్తలు...

విద్యాసంస్థలు సినిమా థియేటర్లలో అగ్ని ప్రమాదాలు అదుపు చేయడానికి కార్బన్‌డయాక్సైడ్ సిలిండర్లు ఏర్పాటు చేసుకోవాలి.

◆ రైతులు పొలాల్లో చెత్తకు నిప్పు పెట్టినప్పుడు మంటలు ఆరిపోయేంత వరకు అక్కడే ఉండాలి.

◆ ఇళ్ల మధ్య గుడిసెలు ఉన్న స్థలాల్లో ఎండుగడ్డి లాంటివి లేకుండా చూసుకోవాలి.

◆ గుడిసెలో దీపం వెలిగించి నిద్రపోకూడదు. గ్యాస్ లీకేజీ అయినప్పుడు లైట్లు వెలిగించకుండా కిటికీలను తెరిచి ఉంచాలి.



ఘట్‌కేసర్ ప్రభుత్వాసుపత్రిలో అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మంటలు వ్యాపించినప్పుడు..

అగ్నిప్రమాదం జరగ్గానే 101కి సమాచారం అందించి ప్రమాదం జరిగిన స్థలం చిరునామా, ఫోన్‌నెంబర్, మండుతున్న వివరాలను స్పష్టంగా చెప్పాలి. ఇంట్లో ప్రమాదం జరగ్గానే అందరినీ బయటకు పంపించి విద్యుత్ పరికరాలకు మంటలు అంటుకుంటే మంటలపై నీళ్లు చల్లకుండా విద్యుత్ సరఫరా నిలిపేయాలి. ఫైరింజన్ వచ్చే వరకు మంటలు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

అగ్నిప్రమాదాలపై అవగాహన...

అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 20 వరకు ఫైర్ సిబ్బంది వారం రోజుల పాటు కళాశాలలు, బస్, రైల్వేస్టేషన్లు, అపార్ట్‌మెంట్లు, కాలనీలు, పారిశ్రామిక వాడల్లో అగ్నిప్రమాదాల నివారణకు అవగాహన కల్పిస్తారు. మంటలు వ్యాపించకుండా, మంటలు ఎగిసిపడినప్పుడు, గ్యాస్ వినియోగంపై గృహిణులు పాటించాల్సిన జాగ్రత్తలు వివరిస్తారు.

అప్రమత్తంగా ఉండాలి..



ఇంట్లో గ్యాస్, ఏసీలు, ఎలక్ట్రానిక్ పరికాలను ఐఎస్ఐ మార్కు ఉన్న వాటిని వినియోగించాలి. అవసరం లేనప్పుడు ఏసీలకు కరెంట్ సరఫరాను నిలిపేయాలి. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు బాధపడటం కంటే ప్రమాదాల జరగకుండా చూసుకోవడం మంచిది. ప్రమాదం జరిగిన వెంటనే 101కు సమాచారం ఇవ్వాలి.

– కె. చంద్రశేఖర్, చర్లపల్లి అగ్నిమాపక కేంద్రం అధికారి